క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: కాటేదాన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 9.30 గంటల వరకు శాస్త్రీపురం, కింగ్స్‌కాలనీ, రాఘవేంద్ర కాలనీ, హసన్‌నగర్, ఎన్‌పీఏ, సాయిబాబానగర్, బాల్‌రెడ్డినగర్, శివరాంపల్లి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

వీధి వ్యాపారులకు గొడుగుల అందజేత



గొడుగులు అందజేస్తున్న అర్చనజయప్రకాష్

రాజేంద్రనగర్: రోజు రోజుకు పెరుగుతున్న వేసవి ఎండలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చనజయప్రకాష్ పేర్కొన్నారు. చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో వీధి వ్యాపారులకు అందజేస్తున్న గొడుగులను మంగళవారం పలువురికి కార్పొరేటర్ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోజు రోజుకు ఎండల తీవ్రత పెరుగుతుందని రోడ్లపై వ్యాపారులు చేసుకునే వారు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ ఎండలు ఎంతో ప్రమాదకరమైనని వీటి నుంచి తప్పించుకునేందుకు జా గ్రత్తలను పాటించాలని సూచించారు. ఈ కా ర్యక్రమంలో ధర్మారెడ్డి, శివ, దేవదాస్, రా జుగౌడ్, సూర్యప్రకాష్ రెడ్డి, జాకీర్ పాల్గొన్నారు.

సీఎంకప్ రెజ్లింగ్‌లో ప్రతిభ



పతకాలు, సర్టిఫికెట్లతో క్రీడాకారులు

మణికొండ: ముఖ్యమంత్రి కప్ రెజ్లింగ్ ఛాంపియన్ షిప్‌లో మణికొండ ప్రాంతానికి చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. యూసుఫ్‌గూడలోని కేవీబీఆర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి సీఎం కప్ రెజ్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు కొనసాగుతున్నాయి. 57 కిలోల విభాగంలో ఎస్.సందీప్ బ్రోన్జ్, 65 కిలోల విభాగంలో ఆర్.వరుణ్ సిల్వర్, 74 కిలోల విభాగంలో జే.రాజు బ్రోన్జ్, 86 కిలోల విభాగంలో జి.నరేందర్ సిల్వర్ మెడల్స్ ల్ సాధించారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ చైర్మన్ ఆంజనేయులుగౌడ్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రవీందర్ చేతుల మీదుగా క్రీడాకారులు పతకాలు, సర్టిఫికెట్లు అందుకున్నారు.

2, 3 తేదీల్లో గోల్కొండ కోటలో 'ఖిలా ఔర్ కహానియా'

గోల్కొండ: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా జూన్ 2, 3 తేదీల్లో గోల్కొండ కోటలో 'ఖిలా ఔర్ కహానియా' ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆర్కియాలజిక్ సర్వే ఆఫ్ ఇండియా హైదరాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ డాక్టర్ స్మితా ఎస్ కుమార్ తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. జూన్ 2,3 తేదీల్లో సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ సౌజన్యంతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, 2న కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర అవతరణ సందర్భంగా పతాకావిష్కరణ చేస్తారని ఆమె వివరించారు.

కాలనీల్లో గడపగడపకూ బీజేపీ



రాజరాజేశ్వరికాలనీలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న రవికుమార్

గచ్చిబౌలి: గడపగడపకూ బీజేపీ కార్యక్రమంను 43వ రోజు కొండాపూర్ డివిజన్ రాజరాజేశ్వరి నగర్, గోల్డెన్ తులిప్ ప్రాంతాలలో మంగళవారం రాత్రి నిర్వహించారు. ఆయా కాలనీల్లో పార్టీ నాయకుడు రవికుమార్ యాదవ్ ఇంటింటికి తిరుగుతూ బీజేపీ కరపత్రాలను పంపిణీ చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లిలోని బస్తీలు, కాలనీలు అన్నింటిలోనూ పూర్తి మౌలిక వసతుల కల్పన బీజేపీకే సాధ్యమన్నారు. ప్రజలు కోరినట్లుగానే అభివృద్ధి పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. బీఆర్ఎస్ పార్టీ హయాంలో కబ్జాలు, అవినీతి ఎక్కువని ఆరోపించారు. కృష్ణముదిరాజ్, అంజనేయులు, చంద్రశేఖర్‌యాదవ్, ఎల్లేష్, అనీల్‌కుమార్‌యాదవ్, రాజు,కిరణ్, మల్లేష్, నరేష్, మధుయాదవ్, మన్యం,పద్మ, పార్వతి, నాగులు, మల్లీశ్వరి, సాగర్, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ ఏదీ?

అధ్వానంగా శాంతినగర్ పార్కు

- ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు
- చెత్తాచెదారం, క్రిమికీటకాల సంచారం
- పార్కులో మద్యం బాటిళ్లు, సిగరెట్ బాక్సులు
- అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



మియాపూర్: హఫీజ్‌పేట్‌లోని శాంతినగర్ పార్కు అధ్వానంగా తయారైంది. పిచ్చిమొక్కలు, చెత్త, చెదారంతో నిండిపోయి కనీసం అడుగుపెట్టేందుకు వీలు లేకుండా ఉంది. లక్షలాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేసిన పార్కు నిర్వహణ విషయంలో శ్రద్ధ చూపకపోవడంతో అపరిశుభ్రంగా తయారైంది.వాకింగ్ ట్రాక్ మొత్తం పూర్తిగా మొక్కలతో నిండిపోయింది. దీంతో వాకర్స్ రావడం లేదు. ఈ పార్కులో హరితహారం పేరుతో మొక్కలు నాటారు. కానీ పర్యవేక్షణ లేక అడవిని తలపిస్తోంది. ఈ పార్కులో క్రిమికీటకాలు తిరుగుతున్నాయని, చుట్టు పక్కల ఇళ్లలోకి వస్తున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో పార్కులు అందుబాటులో లేకపోవడం, సరైన ఆట వస్తువులు లేక సెలవురోజుల్లో పిల్లలు రోడ్లపై ఆడుకుంటూ ప్రమాదాలబారిన పడుతున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. ఇక వృద్ధులు రోడ్లపై వాకింగ్ చేసేటపుడు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్కు నిర్వహణ లేకపోవడంతో అక్కడ చుట్టుపక్కల వారు చెత్త, చెదారం వేస్తున్నారు. ఇక రాత్రి వేళ్లలో మందుబాబులకు అడ్డాగా మారిందని, పార్కులో ఎక్కడ చూసినా మద్యం బాటిళ్లు, సిగరెట్ బాక్సులు, చెత్తతో దర్శనమిస్తోంది. ప్రజాప్రతినిధులు పార్కును అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అడవిని తలపిస్తోంది..

హరితహారం పేరుతో పార్కును మొక్కలతో నింపారు. దీంతో దట్టమైన అడవిని తలపిస్తోంది. చెత్త, చెదారం, పిచ్చిమొక్కలు ఉండడంతో పార్కులో అడుగు పెట్టడానికి భయమేస్తోంది. ఎవరూ పట్టించుకోకపోవడంతో పాములు, తేళ్లు, తిరుగుతున్నాయి. – నాగమణి, స్థానికురాలు

ప్రజాధనం వృథా

శాంతినగర్ పార్కులో ఖాళీ స్థలం లేకుండా మొక్కలు నాటారు. పిల్లలు ఆడుకోవడానికి స్థలం లేదు. ఆట వస్తువులు లేవు. పార్కులు అంటే పిల్లల ఆట వస్తువులు, విశాల స్థలం.. పచ్చదనంతో నిండి ఉండాలి. కానీ ఈ పార్కు అడవిని తలపిస్తోంది. – కృష్ణ, స్థానికురాలు



శాంతినగర్ పార్కులో పిచ్చి మొక్కలు



పార్కులో మద్యం బాటిళ్లు



జూన్ 2 నుంచి దశాబ్ది ఉత్సవాలు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జూన్ 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు మేయర్ మహేందర్‌గౌడ్ వెల్లడించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ సూచనలతో ఈ ఉత్సవాలను 20 రోజుల పాటు నిర్వహిస్తున్నామన్నారు. ప్రణాళికాబద్ధంగా వేడుకలను నిర్వహిస్తామని ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ కార్పొరేషన్ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, పద్మావతిపాపయ్యయాదవ్, భూపాల్‌గౌడ్, తలారీ చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి, ప్రశాంత్‌నాయక్, అస్లాంబిన్ అబ్దుల్లా, ముద్దం రాము పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహేందర్‌గౌడ్

సమస్యల వలయంలో శంషాబాద్ : బీజేపీ

శంషాబాద్: శంషాబాద్ పట్టణంతో పాటు పరిసర గ్రామాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని బీజేపీ నేతలు ఆరోపించారు. మంగళవారం కిషన్‌గూడలోని హోటల్‌లో నిర్వహించిన బీజేపీ పట్టణ, మండల కార్యవర్గాల సమావేశంలో పలువురు మాట్లాడారు. ప్రభుత్వం జీవో 111 తొలగింపు పేరిట ప్రజలను మోసం చేస్తున్నారని జీవో ఎత్తివేతలో నేటికీ ఎలాంటి మార్గదర్శకాలు కూడా లేవన్నారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారిందని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. చెరువులు, కుంటలను కబ్జాల నుంచి కాపాడి వాటిని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. పట్టణం, గ్రామాల్లో సమస్యలు పెరిగిపోతున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదన్నారు. అంతకు ముందు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌రాజ్, నందకిశోర్ గుప్తా, వెంకటయ్య, మహిపాల్‌రెడ్డి, శ్రీధర్, మహేందర్, జితేందర్, వంశీయాదవ్,జనార్ధన్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



బీజేపీ జెండాను ఆవిష్కరించిన నాయకులు

కొండాపూర్ ఆస్పత్రిలో స్వచ్ఛభారత్



ఆస్పత్రి ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న డాక్టర్ వరదాచారి, సిబ్బంది

గచ్చిబౌలి: కొండాపూర్ ఏరియా జిల్లా ఆస్పత్రిలో మంగళవారం చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రి ప్రాంగణంలో చెత్తను తొలగించారు. సూపరింటెండెంట్ డాక్టర్ వరదాచారి ఆధ్వర్యంలో సిబ్బంది పాల్గొన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే రోగాలు దరిచేరవని, ప్రతి ఒక్కరు ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, అటెండెంట్లు ఎక్కడ పడితే అక్కడ చెత్త, వ్యర్థాలను వేయవద్దని సూచించారు.

అమ్మవారికి విజయారెడ్డి ప్రత్యేక పూజలు

యాకుత్‌పురా: పాతబస్తీ హరిబౌలి శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయ వజ్రోత్సవాల్లో భాగంగా మంగళవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ విజయారెడ్డి తన సోదరి డాక్టర్ అనురాగిణి రెడ్డితో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రార్థన మందిరంలో జరుగుతున్న నిత్య అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాద వితరణ చేసి, భక్తులతో కలిసి భోజనం చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బోనాల వజ్రోత్సవాల సందర్భంగా 75 రోజుల పాటు ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అనురాగిణి రెడ్డి రూ.25 వేలు ఆలయ కమిటీకి విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రాందేవ్ అగర్వాల్, ప్రతినిధులు సతీష్ కుమార్, కృష్ణ, వినోద్, శ్రీకాంత్, మహేష్, అరుణ్, రామ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ

విజయనగర్‌కాలనీ: విద్యార్థినులు, యువతులు ఆత్మరక్షణ పెంపొందించుకునేందుకు కరాటే దోహద పడుతుందని విజయనగర్‌కాలనీ సెయింట్ ఆన్స్ బాలికల ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ అల్లం విజయరాణి, కరాటే మాస్టర్ జొన్నగిరి శ్రీధర్ అన్నారు. పాఠశాల ఆవరణలో నెల రోజులుగా కొనసాగుతున్న సమ్మర్ క్యాంప్‌లో భాగంగా ఏర్పాటు చేసిన కరాటే శిక్షణలో విజయం సాధించిన విద్యార్థినులకు మంగళవారం ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో సమ్మర్ క్యాంప్ కో ఆర్డినేటర్ నీలిమ, విద్యార్థులు పాల్గొన్నారు.



అరుదైన శస్త్ర చికిత్స

గచ్చిబౌలి: యాంకీలోజింగ్ స్పాండిలైటిస్‌తో బాధపడుతున్న 80 ఏళ్ల వృద్ధుడికి కొండాపూర్ కిమ్స్ వైద్యులు అరుదైన వెన్నుముక సర్జరీ చేసినట్లు స్పైన్ సర్జన్ డాక్టర్ కృష్ణ చైతన్య తెలిపారు. వెన్నుముక, మెడ భాగం గట్టిగా మారడంతో తల కిందకి వాలిపోవడంతో మూడేళ్ల నుంచి నిద్రలేక బాధపడుతున్నాడని పేర్కొన్నారు. కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రికి రావడంతో వైద్య పరీక్షలు చేసి పెడికిల్ సబ్‌ట్రాక్షన్ ఆస్టియోటమీ అనే శస్త్ర చికిత్స గురించి కుటుంబసభ్యులకు వివరించారు. రోగి వెన్నుముకను 3డి ప్రింటింగ్ తీసి ఇంట్రా ఆపరేటివ్ న్యూరల్ మానిటరింగ్ ద్వారా 8 గంటలు శస్త్ర చికిత్స చేసినట్లు తెలిపారు. ఎల్3 భాగం నుంచి 30 డిగ్రీల వెన్నుముకను తొలగించడంతో మెడ మామూలుగా నిలబెట్టగలిగే స్థితి వచ్చిందన్నారు. శస్త్ర చికిత్స అనంతరం వృద్ధుడు పూర్తిగా కోలుకున్నారని తెలిపారు.

'ప్రజాస్వామ్య విలువలను మరింత ఇనుమడింపచేస్తుంది'

రాయదుర్గం: ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఎదుగుతున్న భారతదేశంలో ఈ కొత్త పార్లమెంటు ప్రజాస్వామ్య విలువలను మరింతగా ఇనుమడింప చేస్తుందని, భవన నిర్మాణంలో సీబీఆర్ఐ పాత్ర ఉండడం సంతోషదాయకం అని సీబీఆర్ఐ డైరెక్టర్, ట్రిపుల్‌ఐటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొ. ప్రదీప్‌కుమార్ రామన్‌చర్ల మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

గోల్కొండ: నానల్‌నగర్ తిరుపల్లి గడ్డలోని శ్రీ కోవెల రంగనాయక స్వామి ఆలయంలో మంగళవారం దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవ పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. బ్రహ్మశ్రీ పాలెం మనోహర్ శర్మ నేతృత్వంలో దేవీ ఉపాసకులు ఎస్. రాజు వస్తాద్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు దేవతార్చన, మూలమంత్ర అవనం, మహానారాయణ లక్ష్మీనరసింహ సుదర్శన యాగం, స్వామి వార్లకు విశేష మహాపూజ, యంత్ర విగ్రహాలకు తిరుస్వపనము, హారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు.

కుంట అభివృద్ధి పనులకు శ్రీకారం

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్‌లోని శ్రీ అనంతపద్మనాభ స్వామి దేవాలయం కుంట అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నట్లు డివిజన్ కార్పొరేటర్ మోంగ్ర సంగీతగౌరీశంకర్ వెల్లడించారు. మంగళవారం అక్కడే ఉన్న కల్పవృక్షం చెట్టు దగ్గర కొబ్బరికాయలు కొట్టి సంబంధిత అధికారులతో కలిసి అభివృద్ధి పనుల కోసం పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అతి పురాతనమైన అనంతపద్మనాభ స్వామి దేవాలయం ఉండడం ఇక్కడి ప్రజలకు పూర్వజన్మ సుకృతమన్నారు. దేవాలయ ప్రాంగణంలో కాశా హనుమాన్ మందిరం అదే విధంగా అనునిత్యం గోశాల గోవులను పూజించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారన్నారు. అనంతపద్మనాభ స్వామి దేవాలయం కుంట చెరువు అభివృద్ధి జరిగితే పాండురంగానగర్, హుడాకాలనీ వాసులకు ఉపశమనం కలుగుతుందన్నారు. వర్షాకాలంలో వరదలతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ దేవాలయం కుంట పనుల కోసం ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ తరపున రూ.90 లక్షల వ్యయంతో పనులు ప్రారంభం అవుతుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో ప్రవీణ్, కోటి శ్రీధర్, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ విశ్వం, కాంట్రాక్టర్ నాగిరెడ్డి, కాపూరి వెంకటేష్, చెన్నయ్య, సాయియాదవ్ పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ సంగీతగౌరీశంకర్

కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాడుతాం

మణికొండ: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ అలుపెరగని పోరాటం చేస్తుందని గండిపేట్ మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నార్సింగి మున్సిపల్ కోకాపేట్‌లో మహిపాల్, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ అంబేద్కర్ చౌరస్తా వద్ద నర్సింగ్‌రావు, యాదగిరి ఆధ్వర్యంలో జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. నేటికీ సీఐటీయూ ఆవిర్భవించి 53 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కార్మికులు, కర్షకుల, కష్టసుఖాలకు ఈ జెండా తోడునీడ అయిందన్నారు. పోరాటాల పటిమకు స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనంగా ఈ ఎర్రజెండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సుభాష్, నరేందర్, రామ్మోహన్, పద్మమ్మ, సావిత్రి, శ్రీహరి, జంగయ్య, బుజ్జమ్మ, యాదమ్మ, మైపాల్, సుకీర్త, సుకన్య పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు పథకం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 7వ డివిజన్ కార్పొరేటర్ పద్మావతి పాపయ్యయాదవ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్ హిదయత్ స్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. జూన్ 12వ తేదీ వరకు కొనసాగే కంటి వెలుగు శిబిరాన్ని స్థానికులు సద్వినియోగంచేసుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని రెండు దఫాలుగా విజయవంతం కొనసాగిస్తుందని దీనికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం అమృత, శాఫీయుద్దీన్, రాజు, అబుబకార్, నర్సారెడ్డి కాలనీ అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

'తెలంగాణలో బీజేపీ గెలుపు ఖాయం'

అత్తాపూర్: మరోసారి మోదీ సర్కారు, తెలంగాణలో ఈసారి బీజేపీ ప్రభుత్వం అను నినాదంతో కమలం గుర్తును ప్రతి పోలింగ్ బూత్‌లో వాల్‌ప్రింట్ నిర్వహిస్తున్నామని జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ రాచూరి రాజశేఖర్ వెల్లడించారు. బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు దివార్ లేఖన్ అభియాన్ కార్యక్రమాన్ని అత్తాపూర్ డివిజన్‌లోని లాలా లజపత్‌రాయ్ శక్తి కేంద్రం తేజస్వీనగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తున్నామన్నారు. ఈసారి రాష్ట్ర ప్రజలు బీజేపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాందీర్‌సింగ్, రామమూర్తి, యాదయ్య, రఘునందన్, నందు, లక్ష్మినారాయణ, శ్యామ్ పాల్గొన్నారు.



దివార్ లేఖన్ అభియాన్‌లో పాల్గొన్న నాయకులు

వేర్వేరు ప్రాంతాల్లో గుర్తు తెలియని మృతదేహాలు లభ్యం

రాజేంద్రనగర్: వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తుల మృతదేహాలు లభ్యమైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నాయి. పోలీసుల వివరాల ప్రకారం.. పీవీనర్సింహ్మారావు ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నెంబర్–330 ఆరాంఘర్ చౌరస్తాలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. 25–30 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని మృతుడి గురించి ఆరా తీసినా ఎలాంటి వివరాలు లభించలేదన్నారు. అధిక మోతాదులో మద్యం తాగి మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

ఆరాంఘర్ చౌరస్తాలో..

ఆరాంఘర్ చౌరస్తా ప్రాంతంలో ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. పీవీనర్సింహ్మారావు ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్–320 వద్ద ఓ వ్యక్తి పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుడు స్థానికంగా భిక్షాటన చేస్తూ ఉండేవాడని అనారోగ్యం కారణంగా మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

గ్రంథాలయాలకు అత్యాధునిక హంగులు

గోల్కొండ: ఆధునిక విజ్ఞాన కేంద్రాలైన గ్రంథాలయాలకు అత్యాధునిక హంగులు కల్పించి అందరికీ ఉపయోగంలోకి తేవడమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన జూబ్లీహిల్స్ నియోజకవర్గం, షేక్‌పేట్‌లో రూ.60 లక్షలతో చేపట్టిన నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ గత కొంత కాలంగా గ్రంథాలయాలకు వచ్చే పాఠకుల సంఖ్య తగ్గిపోతుందన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం గ్రంథాలయాల్లో పాఠకులను ఆకర్షించేందుకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందుకుగాను భారీగా నిధులు వెచ్చించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగుల కోసం ప్రతి గ్రంథాలయంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి వారికి అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచుతామన్నారు. ముఖ్యమంత్రి గ్రంథాలయాల ఆధునీకీకరణపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. స్వంత భవనాలు లేని గ్రంథాలయాలకు నూతన భవనాలు, శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయ భవనాల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకుగాను నగరంలో 14 గ్రంథాలయాలకు రూ.9.4 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. పోటీ పరీక్షల కోసం సిద్ధమయ్యే వారి కోసం అవసరమైన మెటీరియల్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రతి రోజూ ప్రజలు కనీసం ఒకసారైనా తమ సమీపంలోని గ్రంథాలయాలను సందర్శించేలా వాటిని తీర్చిదిద్దుతామన్నారు. విద్యార్థులకు సైతం వారికి అవసరమైన పుస్తకాలను ప్రధాన భాషలల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. రాష్ట్రంలో ప్రజలందరూ సంతోషంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయమని, అందులో భాగంగానే ప్రభుత్వం సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తూ, మరోవైపు అభివృద్ధి పనులు చేపడుతుందన్నారు. బీఆర్ఎస్ గ్రేటర్ అధ్యక్షులు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రసన్న, కార్యదర్శి పద్మజ, బీఆర్ఎస్ షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షులు బి. ప్రదీప్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



షేక్‌పేట్‌లో గ్రంథాలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి తలసాని, ఎమ్మెల్యే మాగంటి తదితరులు